**ఈవారం కథ**



# సమాధుల తోట

బి.పి. కరుణాకర్

లలిత కోసమై వాళ్ళ ఆఫీసులోకి వదుస్తున్నానో లేదో ఆవిడే బయటకు వస్తూ కనిపించింది. కొద్దిగా ఆలస్యం అయిం దంటే మిస్ అయి వుండే దాన్ని.

"నీ కోసమే వస్తున్నాను" అన్నాను.

"చాలా రోజుల తర్వాత గుర్తుకు వచ్చామే" వుల్లవిరువుగా అని, "పర్మిషన్ తీసుకుని బయ టకు వెళ్తున్నాను. నీకు వేరే పని లేకపోతే నాతో రా" అన్నది వేగంగా వదుస్తూ.

ఆవిడ ప్రక్కనే వదుస్తూ "ఎక్కడికి?" అని అడి గాను.

"ఇవేళ ఆల్ సోల్స్ డే. సమాధుల తోటకు

వెళ్తున్నాను. రావడానికి నీకేం అభ్యంతరం లేదు కదా!"

"లేదు"

"మా పిల్లలను బడి నుంచి నరాసరి సమాధుల తోటకు రమ్మని చెప్పాను. అక్కడ నా కోసం ఎదురుచూస్తూ వుంటారు" అన్నది.

ఇద్దరం రోడ్డు మీదకు వచ్చి ఆటోరిక్షా మాట్లాడుకుని ఎక్కి కూర్చున్నాం. ఆటో కదిలింది.

అక్కడికి బోయిగూడ సమాధుల తోట రెండు కిలోమీటర్ల దూరంలో వుంటుంది. వాచీ చూసుకున్నాను. చీకటిపడే లోపల ఇంటికి చేరుకోవచ్చు. ఆయనకు నేనంటే అనుమానం. ఇంటికి చేరుకోవడం ఆలస్యం అయితే సాధింపు మొదలెడతాడు. జీవితం అంటే విసుగెత్తిపోతోంది. పట్టుబట్టి కావాలని కోరి మరీ నన్ను పెళ్ళి చేసుకున్న మనిషి..

"చెప్పు ఎలా వున్నావు?" అడిగింది లలిత.

"బాగానే వున్నాను" అన్నాను. నా గొంతు నాకే కొత్తగా ధ్వనించింది.

"నీ పెళ్ళయి సంవత్సరం దాటిందనుకుంటాను. విశేషాలేమీ లేవా?" అడిగింది.

"లేవు. నా పెళ్ళికి తప్పకుండా వస్తానన్నావు. రాలేదు" అన్నాను నిష్ఠూరంగా.

"రాలేకపోయాను. నీ పెళ్ళి రోజున ఈ ఊళ్ళోనే వున్నాను. ఒక అర్జెంట్ పని నన్ను ఎటూ కదలనీయకుండా చేసింది... పెళ్ళి బాగా జరిగిందని విన్నాను. నీ జీవితం ఎలా వుంది?"

ఏం చెప్పేది? నుదుటి మీద పడుతున్న జుట్టును వెనక్కి నెట్టుకుంటూ తల పక్కకు తిప్పుకున్నాను.

"పెళ్ళి అయ్యాక ఉద్యోగం మానేస్తానని అన్నావు. మానేయలేదా?" అడిగింది.

"మానేద్దామనే అనుకున్నాను. అయిదు నెలలపాటు సెలవు పెట్టి ఇంట్లోనే వున్నాను. ఇన్ని సంవత్సరాల పాటు ఉద్యోగం చేశాను కదా. ఇంట్లో కూర్చుని బోరు కొట్టింది. తిరిగి ఉద్యోగంలో చేరాను."

"మీ ఆయన ఒప్పుకున్నాడా?"

"నేను ఉద్యోగం చేయడం ఆయనకు ఇష్టం లేదు" అన్నాను.

లలిత నా కుడి చేతిని తన చేతుల్లోకి తీసుకుని నా గాజులు సవరిస్తూ మా ఆయన వ్యాపారం గురించి, సంపాదన గురించి అడుగుతూ నా చేతిని సుతారంగా నొక్కి "బాబూరావును ఎట్లా మర్చిపోగలిగావు?" అడిగింది.

'లేదు. నేను బాబూరావును మర్చిపోలేదు. మర్చిపోలేను. అతను నాకు గుర్తురాని రోజంటూ లేదు' అని అందామనుకునేంతలో నా కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. ఆ కన్నీరు లలిత కంటబడటం నాకు ఇష్టంలేదు. మాట బయటకు వస్తే కంఠం దుఃఖంతో నిండిపోతుంది. తల అడ్డంగా ఆడించి రోడ్డు మీదికి దృష్టి సారించాను.

"నువ్వు హృదయం లేని మనిషివి" అన్నది.

కొద్దిసేపు మౌనంగా వుండి చివరకు గొంతు సవరించుకుని, "బాబూరావు ఎలా వున్నాడు?" అడిగాను.

"నిన్ను ఎంతగానో ప్రేమించిన మనిషి, ఎలా వుంటాడని ఊహిస్తున్నావు?"

"అన్నీ మనం అనుకున్నట్లే జరిగితే జీవితం ఎంత హాయిగా వుంటుంది! నేను అతన్ని ఇంకా ప్రేమిస్తున్నాను. నేను అబద్ధం చెప్పటం లేదు. తిరిగి ఉద్యోగంలో చేరాక అయిదారుసార్లు అతని ఆఫీసుకు ఫోన్ చేశాను. ఎవ్వరూ దొరకలేదు. నెంబరు మారిపోయిందట. చివరకు ఈ రోజు అతన్ని చూడాలని ఎంతో ఆశతో వాళ్ళ ఆఫీసుకు వెళ్ళాను, వాళ్ళ ఆఫీసు వేరే చోటకు మార్చారట. అదెక్కడో తెలుసుకోవడానికి నీ దగ్గరకు వచ్చాను."

"అంతగా ప్రేమించిన మనిషిని ఎందుకు పెళ్ళి చేసుకోలేదు? వర్ణాంతర వివాహమని భయపడ్డావా?"

"భయపడలేదు. మా ఇంట్లో మా అమ్మను ఒప్పించాను. అన్నయ్యను ఒప్పించాను. మా చిన్నాన్న ఒప్పుకోలేదు. చాలా గొడవచేసి, ఈ పెళ్ళి ఎలాకాదో నేను చూస్తాను అని బలవంతంగా నా మెడలు వంచి నా పెళ్ళి చేశారు. మా యాదగిరి చిన్నాన్న సంగతి నువ్వు వినే వుంటావు..."

లలిత నా మాటలకు అడ్డుతగిలి, "నువ్వు చాలా విచిత్రమైన మనస్తత్వం కలిగినదానివి. ఎవ్వరికీ అర్థంకావు. నీ అభిప్రాయాలు స్థిరంగా వుండవు. త్వరత్వరగా మారిపోతుంటాయి. నువను మార్చేసుకుంటుంటావు. వెల్. ఇప్పుడంతా అయిపోయింది. ప్రశాంతంగా వున్న వాతావరణాన్ని కదిపి నువ్వు సాధించదల్చుకుంది ఏమిటి?" అడిగింది ఆవేశంగా.

కొద్దిసేపు మౌనంగా వుంది. "అయ్ మిస్ హిం ఎలాట్. నా కతన్ని చూడాలనుంది. ఒక్క అయిదు నిమిషాలయినా అతనితో మనసారా మాట్లాడాలనుంది. అంతే. నా కేమీ వద్దు" అన్నాను.

పావుగంట తర్వాత ఆటో బోయిగూడ సమాధుల తోట ముందు ఆగింది. దిగాం. మీటర్ చూసి డబ్బులిచ్చి కిటకిటలాడుతున్న జనాల్లోంచి అడుక్కునే వాళ్ళను, పూలు, కొవ్వొత్తులు, అగరబత్తులు అమ్మేవాళ్ళను తప్పించుకుంటూ లోపలికి నడిచాం.

నేను సమాధుల తోటలోకి అడుగుపెట్టడం అదే మొదటిసారి. లలిత భర్త సమాధి సమాధుల తోట గోడకు ఆనుకుని ఒక మూలగా వుంది. మేం అక్కడకు చేరుకునేసరికి లలిత కూతురు, కొడుకు సమాధిని పూలతో అలంకరించి చుట్టూ

## రంగులూ-రాగాలూ

చుక్కల చెక్కిలిని
ముద్దాడిన క్షణాన
చందమామతో
దాగుడుమూతలాడిన క్షణాన
తల్లి నొడిలో తల నుంచి
బోరుమని ఏడుస్తున్న క్షణాన
మనసు ఏకాంతాన్ని
కౌగిలించుకున్న క్షణాన

శూన్యంలోకి చూస్తున్న కళ్ళతో
గాలిలో ఆడుకుంటున్న కాళ్ళతో
నేనీ భావాల్ని చిలుకుతున్నాను!

నిన్న అనుభవాలలో గుచ్చుకున్న గాయం
రేపు పెద్ద వ్రణమై బాధించవచ్చు
మనసు దరికి చేరిన అనుభవ సారం
చెలి నెగళ్ళకు ఆవిరి కావచ్చు

కాళ్ళు కష్టాల కోర్చే పనిముట్లయి
కళ్ళు కొలిమిలో చింతనిప్పులై
సముద్రంలోని సుడిగుండంలా
జీవితం!


సముద్రం లోతు తెలియదు
ఆకాశానికి హద్దులు లేవు
మనసనే ఆనందశాలలో
భావ రూపాలకు అంతం లేదు

లోకంలోని ప్రతి వస్తువూ
పదేపదే చూపు మార్చి నన్నల్ని చూస్తాయి
చూసిన ప్రతి చూపు వెనుక
ప్రతిసారి నవకేవో అర్థాలు గోచరిస్తుంటాయి

ఒక క్షణం భావ తీవ్రత
మరోక్షణం ప్రశాంతత
సన్నివేశాలలోని అంతర్యాన్ని కనిపెట్టలేని మనసు
అల్లకల్లోలమవుతుంది

కొత్త ఆలోచనలతో
పుష్పిస్తూ... వాడిపోతూ...
మళ్ళీ పుష్పిస్తూ...

- బి. నరసింగరావు




కొవ్వొత్తులు పెడుతున్నారు. వెలిగిస్తుంటే కొవ్వొత్తులు ఆరిపోతున్నాయి.

మమ్మల్ని చూడగానే పిల్లలు నన్ను పలకరించి లలితకు రోజా పూలు అందించారు. లలిత వాటిని సమాధి మీద సిలువ ఆకారంలో పేర్చి, అగరొత్తులు వెలిగించింది. కొంగుతో తల కప్పుకుని మూడు నిమిషాలపాటు ప్రార్థన చేసింది. లలిత చేతులు జోడించి ప్రార్థన చేస్తున్నప్పుడు నేను కళ్ళు మూసుకోలేదు. ఆవిడ ముఖంలోకి, పిల్లల ముఖంలోకి చూశాను. అందరి కళ్ళ వెంట నీళ్ళు కారుతున్నాయి. ఆ సమయంలో లలిత ముఖం గంభీరమై నేనెప్పుడూ చూడని కొత్త లలితలా అవుపించింది.

ప్రార్థన ముగించిన తర్వాత లలిత పిల్లలు వాళ్ళకు తెలిసిన వాళ్ళెవరో కనిపిస్తే వాళ్ళతో మాట్లాడుతోంటే, లలిత మిగిలిపోయిన పూలను, కొవ్వొత్తుల పేకెట్, అగరొత్తులు ప్లాస్టిక్ బుట్టలో వేసి "పద" అని అక్కడికి దగ్గరలో వున్న మరో సమాధి ముందు ఆగింది. ఆ సున్నంకొట్టిన మట్టి సమాధి చుట్టూ పూలు పేర్చి కొవ్వొత్తుల పేకెట్ నాకు అందించి "ఈ ప్యాకెట్ విప్పి కొవ్వొత్తులు వెలిగించి సమాధి చుట్టూ పెట్టు" అన్నది.

ఈ తతంగం అంతా నాకు విసుగు కలిగిస్తోంది. విసుగు అవుపించకుండా ఆమె ముఖంలోకి ఇబ్బందిగా చూశాను. అగరొత్తుల వాసనకు నాకు తలనొప్పి మొదలయింది. కొవ్వొత్తుల పేకెట్ను అయిష్టంగా అందుకుని సమాధి చుట్టూ పెట్టాను. వెలిగిస్తుంటే కొన్ని ఆరిపోయాయి. ఆ వాసన, ఆ గాలికి నా ఊపిరి బిగుసుకుపోతున్నట్లనిపిస్తోంది. అక్కడి నుండి ఎంత త్వరగా బయటపడితే అంత మంచిదనిపిస్తోంది.

లలిత నా ప్రక్కగా వచ్చి నిలబడింది. రుమాలుతో చేతులు తుడుచుకుంటుంటే, "నీకు శ్రమ కలిగించినందుకు ఏమీ అనుకోకు. ఈ సమాధి బాబూరావుది అని తెలిసివుంటే నువ్వు అయిష్టంగా కొవ్వొత్తులు అందుకునేదానివి కావు, వెలిగించే దానివి కావు - అయిష్టంగానే" అన్నది.

కాలగమనం లిప్తపాటు ఆగిపోయినట్లనిపించింది. నేను నమ్మదల్చుకోలేదు. లలిత నన్ను ఫూల్ను చేస్తోంది. కళ్ళల్లో నీళ్ళు తిరుగుతోంటే నమ్మలేనట్టు తల అడ్డంగా ఆడించాను. ఎక్కడ లేని నిస్సత్తువ నన్ను ఆవరించేసరికి నిలబడలేక ప్రక్కనే వున్న మరో సమాధి మీద కూర్చుండిపోయాను. దుఃఖం ఆగడం లేదు. నోటికి చీరకొంగు అడ్డం పెట్టుకున్నాను.

పది నిముషాలు గడిచాక లలితనాభుజాల చుట్టూ చేయి వేసి "లే. వెళ్దాం" అన్నది.

లలిత వెంటనే జవాబు చెప్పలేదు.

"ఎప్పుడు చనిపోయాడు?" అడిగాను.

"నీ పెళ్ళికి మూడు రోజుల ముందు" అన్నది.

"నా పెళ్ళికినాలుగు రోజుల ముందు నా కతను కలిశాడు. హోటల్ సరోవర్లో భోజనం చేశాం. ఆ తర్వాత ఇద్దరం ఇందిరా పార్కులో సాయంత్రం వరకు కూర్చున్నాం. విడిపోయేప్పుడు అతన్ని వదులుకోవడం ఇష్టంలేక మనిద్దరం ఎటైనా వెళ్ళి పెళ్ళి చేసుకుందామని బలవంతం చేశాను. అతనందుకు ససేమిరా ఒప్పుకోలేదు... బాబూరావు ఆత్మహత్య చేసుకున్నాడా...?"

లలిత తల అడ్డంగా ఆడించి, "లేదు" అన్నది.

"యాక్సిడెంటా?... ప్లీజ్... ఏమయిందో చెప్పు.. ప్లీజ్..."

"నీ పెళ్ళికి ముందు మీ ఇద్దరూ ఎటైనా వెళ్ళిపోదామనుకున్న మాట మీ ఇంట్లో ఎవరికైనా చెప్పావా?"

"చెప్పలేదు."

"గుర్తుతెచ్చుకో."

"... యస్... మా పిన్నికి అనుకుంటాను. అవును. మా పిన్నికి ఒక్కదానికే చెప్పాను."

"మీ పిన్ని అంటే, డి.ఎస్.పి. రాంబాబు భార్య. అవునా?"

"అవును. రాంబాబుగారు మా చిన్నాన్న."

లలిత దీర్ఘంగా నిట్టూర్చి, "బాబూరావును నువ్వే దారుణంగా చంపేసుకున్నావు. బంజారా హిల్స్లో ఆ తెల్లారిగట్ట జరిగిన ఒక ఎన్కౌంటర్లో అతను చనిపోయాడు. ఈ వార్త అన్ని దిన పత్రికలలో వచ్చిందే. ఒక పత్రిక వాళ్ళు కలర్ ఫోటో కూడా వేశారు. రెండు రోజుల తర్వాత శవాన్ని నాకు అప్పగించారు మీ చిన్నాన్న" అన్నది.

* * *

"చిన్నాన్నా, ఈ ఉత్తరాన్ని ఎంతో క్లుప్తంగా రాద్దామనుకుంటే ఇంతయింది. నేను అసహాయురాలిని. చిన్నప్పుడే తండ్రిని పోగొట్టుకున్న అభాగ్యురాలిని. నువ్వు మా కుటుంబాన్ని ఎన్నో విధాలుగా ఆదుకున్నావు. ఇంట్లో వాళ్ళకు ఇష్టంలేని పని నేను చేస్తానేమోనని అమాయకుడైన బాబూరావును చంపడం ఘోరం. అతన్ని ప్రేమించిన నేరానికి నన్ను చంపి వుండవలసింది! ఇదేనా నీ న్యాయం?

చివరిగా ఒక్క కోరిక. నేను చనిపోతే దయచేసి నా శవాన్ని ముట్టుకోకు. నా పాడెను ఎత్తకు. అన్యంపుణ్యం తెలియని అమాయకులను పొట్టన పెట్టుకుంటూ సమాధుల తోటను పెంచకు."

గడచిన రెండు సంవత్సరాలలో ఆ ఉత్తరాన్ని ఎన్నో సార్లు చదివాడు రాంబాబు.

ఉత్తరం మడిచి బల్ల సొరుగులో పెట్టి కళ్ళద్దాలు తీసి కళ్ళల్లో ఉబికిన నీళ్ళు తుడుచుకున్నాడు రాంబాబు. సొరుగులో వున్న రివాల్వర్ తీసి బెల్ట్ కవర్లో పెట్టి ఫోన్ అందుకోబోతోంటే ఫోను మోగింది. రిసీవర్ ఎత్తాడు. "రాంబాబు హియర్" అన్నాడు.

"నేను"

యస్.పి. కంఠస్వరం గుర్తుపట్టాడు రాంబాబు. "గుడ్ మార్నింగ్ సార్" అన్నాడు.

"వెరీ గుడ్మార్నింగ్. నీకో గుడ్ న్యూస్."

"చెప్పండి సార్."

"ఈసారి వచ్చే ప్రమోషన్ లిస్ట్లో నీ పేరు వుందోయ్. బంగారు పతకానికి కూడా మా గురూగారు రికమెండ్ చేశారు. వీటికి నువ్వు పార్టీ ఇచ్చుకోవాలోయ్."

"తప్పకుండా సార్."

"ఇంకో సంగతి... అయిదు రోజుల క్రిందట యాదగిరి, రెహమాన్ లను పట్టుకున్నాం కదా. వాళ్ళను ఏ నాచారమో, ఉప్పలో తీసుకెళ్ళి నొక్కేయ్. ఎప్పుడూ బంజారా హిల్స్ అయితే బావుండదు. ఇవి నా ఆర్డర్స్ కావు. గురూగారివి. పని అయిపోయాక ఒకసారి కలువు."

"యస్ సార్. గుడ్ డే సార్" అని ఫోన్ పెట్టి "రేయ్, వెంకటేశూ! జీప్ సిద్ధం చేయరా" అన్నాడు రాంబాబు ఉత్సాహంగా.